కథానిక

# పడిమి బడుగు

వారణాసి కృష్ణమూర్తి

నిజమే. కాదని ఎవరనగలరు? తను కృషి చేస్తున్నాడు శాయశక్తులా. "కృషితో నాస్తి దుర్భిక్షం" అన్న పెద్దలు ఒక టైం లిమిట్ పెట్టలేదు. దెబ్బ తగలాల్సి ఉంటే తగిలి తీరుతుంది. ఒద్దు అంటే ఊరుకుంటుందా? దండం పెట్టి తప్పించుకోగలమా, కొంతేలు చెప్పి మెప్పించుకోగలమా. తగిలే దెబ్బ తగలక తప్పదు. దెబ్బ తగిల్తే దానికి తల గింగురెత్తక తప్పదు. బుద్ధి మైకం కమ్మ వచ్చును గూడా? కాని తక్షణం లేవొద్దూ? ఎవరు లేవదీస్తారు మనను? స్వయం కృషివల్ల నిలబడాల్సిన వాళ్ళకు రెక్కాడితే గాని డొక్కాడదు.

ఇప్పటిమటుకు ఇప్పుడు, తను కలగన్నాడా ఇలా అవుతుందని. లక్ష్మిని మొన్న రాత్రి పురిటికి ఆస్పత్రికి తీసుకు వెళ్ళేసరికి బ్యాంకులో రెండువందల యాభై పోగుచేశాడా లేదా. పురుడు సవ్యంగా జరగాలనీ, లక్ష్మి ఇంటికి ఒచ్చాకైనా ఓ అర్నెల్లపాటు ఆదుకోడానికి ఉంటుందనీ, ఎంత ప్లాను వేశాడు. లక్ష్మి తన్ను ఎన్నిసార్లు ఎద్దేవా చేయలేదు, నేను తొమ్మిది నెల్లు మోసిన భారంతో సమానంగా మీరూ అర్నెల్లు మోశారని. ఔనుమరి రోజూ రాత్రి తొమ్మిదినుంచి పదిన్నరదాకా ఆ షావుకారి కొడుక్కు ఎకనమిక్స్ నూరిపోయబట్టేగా వాడు తెల్లారితే పురుడనగా మూడు పులిబుర్రలూ తెచ్చి చేతులో పెట్టింది. భార్య గర్భవతి అవడం తనదే బాధ్యత, అందుకే అదనపు సంపాదన చూసుకొని తగు జాగ్రత్తలో బడ్డాడు.

ఇంత దూరాలోచన చేసి అన్నిటికీ తయారయ్యే వెంకట్రాయుడికిగూడా ఈజాబు గొడ్డలి పెట్టుగా ఉంది. ఆ అక్కకు కడుపుకోసి పిల్లను తీయడం, ఖర్చుకుగాను, అప్పుగానే మూడొందలు పంపమని శోభనాద్రి బావ అడగడం అబద్ధం ఆడిడబ్బు లేదనడం తన చేత కాదు. సుతరామూ కాదు. అన్నాడే అనుకోవయ్యా, అక్కడ అవసరం గూడా తీరాలా. ఇరవై ఎకరాల ఆసామి శోభనాద్రి బావ తనకు టెలిగ్రాం ఇవ్వడం ఏమిటీ? తనేం అగ్రహారీకుడా! డజను కంపెనీల్లో షేర్లున్నాయా? జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకులో డైరెక్టరా బావ లాగు? మూడొందలు కాదు మూడు వేలు పుట్టించలేడూ ఆ వూళ్ళో? తన వూళ్ళో తన పేరుకు వాసి రాకూడదు.

అసలు మొదటినుంచీ వెంకట్రాయుడు గుండు గొమ్ముల జాతకుడు. పంధొమ్మిదోయేట యూనివర్సిటీ ఫస్టుగా ఎం. ఏ. ప్యాసవడమే వాడికి జరిగిన పెద్ద దెబ్బ. ఏ థర్డు క్లాసో అవుతే, ఇంటి పట్టున వుండేవాడు. మామూలు ఆసాములు ఎందరులేరు ఎం. ఏ. ప్యాసై ఊగర పూరణ వ్యాసంగంలో. లేకపోతే ఏ కాలేజీలో పంతులో దొరక్క పోయేడా. ఆ ఫస్టులో ఫస్టు అనడంతోటే వాళ్ళనాన్నకు ఆక్స్‌ఫర్డులో డాక్టరేటూ, ఐ. సీ. ఎస్సూ, బార్-ఎట్లాయూ అనే మథన ఏర్పడ్డది. ఉన్న దాంట్లో నాలైకరాలమ్మి థామస్ కుక్కుగారి దోసిట్లో పోసేశాడు నరసింహం పంతులుగారు. వీడు బోటెక్కడామని బొంబాయి వచ్చేసరికి ఆయన కాస్తా బండికట్టేశాడు. కుక్కు కంపెనీవారు దయతో ఇచ్చినసొమ్మును బొంబాయిలోనే బ్యాంకులో ఉంచి, ఇంటికి చేరాడు మరి, ఏక పుత్ర వియోగికి కర్మకాండ సవ్యంగా నిర్వహించడానికి. ఆ ముసలాయన ఇంకో రోజు ఆలస్యంగా పోయివుంటే, ఈ కాస్త పితృ వాత్సల్యం చూపించుకునే యోగ్యతా వెంకట్రాయుడికి దక్కేదే కాదు.

ఆరేళ్ళుగా డి. యి. ఓ. చేస్తున్నాడు, గెజెటెడ్ ఆఫీసర్, ఎన్ని వేలు దాచాడో అనే వారేగాని కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చేత ఇల్లు కట్టించుకున్నందుకు వాళ్ళకు ఇవ్వాలసినది పదకొండు వేలని చెప్పేవారు ఎవరూ లేరు. తండ్రిగారి ప్రావిడెంటు ఫండు ఆరు వేలూ పోనేస్తే ఐదు వేలు తొర మాత్రం, నెల రోజుల్లో కనబడ్డని వెంకట్రాయుడికి. ఇంగ్లండు పోవడానికి తను మనస్ఫూర్తిగా ఒప్పుకోని రెండు కళ్ళూ తెరిచి ఒప్పుకొన్న కండిషన్లు ఏమిటంటే లక్ష్మి మెడలో మూడు ముళ్ళూ వేయడం. ఇంగ్లండు వెళ్ళే ఆలోచన లేకపోతే ఈ బాధ్యతనన్నా తప్పేది.

ఇక పైత్రికం మనకు అక్కరలేదు, అని తెగనమ్ముకుంటే అప్పు లేకుండా ఇల్లు మిగిలింది. ఆ అద్దయినా కొస్త వేన్నీళ్ళూ చన్నీళ్ళూ చూసుకోవచ్చు అనుకుంటే రంగమ్మగారేమో తను ఆ ఇంట్లోనే హరీ అనాలిగాని ససేమిరా బొంబాయి రానంటుంది, పైగా "రెండొందలు జీతం మీ నాన్నగారికి పదిహేనేళ్ళ సర్వీసు అయినాక వచ్చింది, ఇంకా ఎందుకురా నీకూ. దమ్మిడీ అంచం పుచ్చుకోకుండా ఆ ధర్మాత్ములు సరస్వతి పెళ్ళి చేశారు. ఎప్పుడూ నలుగురికి పెడుతుండేవారు" అని గొణుగుతుంది. మళ్ళీ మాట్లాడితే "నా బరువు నీ కెందుకు లేరా" అంటుంది. నాన్నకు రెండొందలు వచ్చిన రోజుల్లో నాలాంటి గుమాస్తాలకు బొంబాయిలో గూడా యాభైకి మించి దొరికేవి గావు, గుమాస్తాగాడికి సరిపోయే జీతం ఏ రోజుల్లోనూ ముట్టలేదు. ఇవన్నీ చెప్పితే ఆమెకు ఒంట పట్టదు. అనవసరంగా లావాదేవీల్లో పడకుండా తేలిన విషయం ఏమిటంటే ఆ ఇల్లు తనది అని అనుకోవచ్చు. అద్దె తనకు రాకపోయినా, పన్ను మాత్రం కట్టుతూ అంటే ప్రతి నెలా పద్ధెనిమిది రూపాయిలు లాంర ఏర్పరచుకొని తన పేర ఇంటిని వుంచుకోగలిగాడు వెంకట్రాయుడు.

తాను ఇంగ్లండు వెళ్ళకపోయినా, వెంకట్రాయుడి జాతకంలో పశ్చిమ భ్రమణం సార్థకం అయింది. బొంబాయిలో బస్సుల కంపెనీ వారి ఆఫీసులో గుమాస్తా అనే పేరుతో పిలవక పోయినా రెండువందలు పుచ్చుకునే గుమాస్తా అయినాడు టి. వి. రామ్, నాలుగేళ్ళ క్రితం. ఈ నాలుగేళ్ళూ వెనక్కు చూస్తే, వెంకట్రాయుడి బ్యాంకు పుస్తకం ఓ కథకు సరిపోయేన్ని సంగతులు చెప్తుంది. ప్రారంభంలో కక్క కంపెనీ వారు ఇచ్చిన రెండు వేలు ఈ రోజున ఉన్నవి రెండువందల ఎనభై. మధ్యలో నాలుగుసార్లు రెండువందలు కనబడతవి కాని మూడుసార్లు ఒంటి అంకే కనబడుతుంది.

రెండు వేలు ఖర్చు కావడం కష్టం ఏమీ లేదు గాని, ఈ నాలుగేళ్ళలో ఐదుసార్లు పెద్ద మొత్తాల ఖర్చులు తగిలాయి వెంకట్రాయుడికి. అమ్మ బొంబాయి రాకపోయినా, కాశీ రామేశ్వర యాత్రలకు ఆరువందలూ, మామగారి మరణానికి తన సంసారంతో వెళ్ళి రావడం ఇత్యాదులకు ఐదువందలు, మేనకోడలి వివాహానికి తమ సంసారం వెళ్ళి రావడానికి ఆరువందలు, లక్ష్మికి టైఫాయిడ్ వచ్చి రెండునెల్లు మంచం దిగకపోవడంతో తొమ్మిదివందలు, ఇప్పుడు పురుటికి ఆసుపత్రి వాళ్ళకు రెండువందలు.

తాఖీదీ తగిలినప్పుడల్లా రొమ్ము విరిచి నిలిచాడు వెంకట్రాయుడు. ఉదయం ఆరున్నర నుంచీ ఎనిమిదిన్నర దాకా ట్యుటోరియల్ కాలేజీలో మేష్టరీ వెలిగించినందుకు-రహస్యంగానే అనుకోండి - నెల తిరిగేసరికి తొంభైరూపాయిలు వస్తాయి కాని ఈ వుద్యోగం మూడు నెల్లు ఉంటే మూడునెల్లు సెలవు. ఏమంటే పరీక్షల ముందేగా ట్యుటోరియల్ కాలేజీ హడావిడి.

ఇక రెండో సంపాదన ఇంకా రహస్యం అయినది కొందరు పెద్దోట్ల అసామీలు ఉంటారు, మతుంగాలో, శాంతాక్రూజ్‌లో, మెరీన్ డ్రైవ్‌లో. వీళ్ళు పాతికవేలు చేసే కారును ఆరునెల్లకన్న వాడరు. ఎన్నికోట్లు పుట్టించుకొంటారో అన్ని బ్యాంకుల్లో ఉంటాయి. కాని, పొట్టకోస్తే అక్షరం ముక్క రాదు. వాళ్ళకు రోజూ పావుగంట ఉత్తరాలు రాసిపెట్టడం అరగంట చేతులు నలుపుకుంటూ దండం పెట్టడం, ఓ నెల నలభై, ఓ నెల ఎనభై, కారిదయ— సంపాదించడం.

మరి ఇంకొకటి వుంది. ఆ సేటు అందరికీ అర్థం కాకపోయినా ఆంగ్లభాషా వ్యామోహం చాలా యెక్కువ. ఎవరో ఒక సేటుతో వెంకటరాయుడు మాట్లాడుతూ "ఫ్రెంచి పేర్లు అట్లా పలకరండీ, ఇట్లాగూ" అన్నాడు దాంతో వాళ్లల్లో గుజరాతీలో వెంకట్రాయుడు యూరపంతా తిరిగొచ్చిన జగజ్జట్టీ అని తేల్చారు. ఎం. ఏ. లో చదువుకున్న కొత్త ఫ్రెంచీ, ఉపయోగించకపోయినా, ఆరురూపాయలు యిచ్చి తెచ్చుకున్న ఆ ప్యాస్‌పోర్టునూ ఉపయోగించుకుని బహిర్దేశాలనుంచి వచ్చిన వ్యాపారస్థులతో ఇంగ్లీషూ ఫ్రెంచీ మాట్లాడితే ఏతృణమో పణమో అప్పజెప్పుతారు ఈ సేటులు.

ఇవి సరే, మగన్‌లాల్ షావుకారు ట్యూషను యేర్పాటుచేసి ఇంకో కొత్తదారి చూపించాడు. ఏదైనా తొందర ఏర్పడ్డం, దాన్ని పూడ్చుకోడం అవుతూంది మన వెంకట్రాయుడి పని. రెండేళ్ళుగా స్వయం అభివృద్ధినిగురించి కలలు కనడం మానేశాడు వెంకట్రాయుడు. కాని అంతకుముందు అనుకునేవాడు, ఇందరు సేటులు ఉన్నారు, ఒక్కడైనా సెక్రెటరీగా వేసుకోంటే ఓ కారూ. ఓ నాల్గుఅంకెల చెక్కు ఒకటో తారీఖున ముట్టేదే అని. కాని ఇప్పుడు గ్రహించాడు, ఈ భాగ్యాలందరికీ మద్రాసీల బుర్ర కావాలి కాని. వారి పురోభివృద్ధి కాదని. మద్రాసీలను కౌగిలించుకుంటారు, కాళ్ళూ చేళ్ళూ పట్టుకుంటారు. కాని తమపని చేయించుకున్నప్పుడు ప్రతిపనికి విలువకట్టి తమ వాళ్ళకైతే ఇవ్వాల్సివచ్చే దానిలో సగం చేతులో పెట్టి ఊరుకుంటారు.

ఇదే ఓకథ అయితే ఏ గుజరాతీవాడో మనవాడికి ఉద్యోగం ఇప్పించడం లేకపోతే ఏ రిజర్వు బ్యాంకులోనో పీడు ఆఫీసర్ కావడం లేకపోతే ఏ కల్చరల్ మిషన్‌లో సెక్రెటరీగా పోవడం కాకపోతే మొదటి దెబ్బతోనే ఏ ఎలెక్ట్రిక్ రైలు క్రిందో పడి ఆ గుప్పెడు ప్రాణాలు పోగొట్టుకునేవాడు. కాని ప్రతి జీవితం పుస్తకాల్లో కథల్లా పరిణామాలు పొందవే ఏడ్చి గోలపెట్టినా సాధించగలిగినా మంచిదే. ప్రార్థించీ, అర్థించీ సంపాదించే రోజులు మళ్ళీ రావాలి.

వెంకట్రాయుడికి బుర్ర తిరిగింది. చతికిలబడ్డాడు. మోకాళ్లు రెండు ధనాధన్ అని మ్రోగినాయి కాళ్లు బారజాపాడు. ఆయెవ్వా నా దరిద్రమా అని అందామనుకున్నాడు కాని తప్పేదేముంది. అక్కడ అపరేషనుకు డబ్బు పంపాడు. తల తాకట్టు పెట్టి డబ్బు తెచ్చి లక్ష్మిని ఇంటికి తెచ్చాడు. తన భాగ్య రేఖ పొరబాటు దరిద్ర రేఖలతో తను కుస్తీ పడుతున్నాడు. తన చేతిలో రేఖతోనే తన దెబ్బలాట. ఏ కోమటి కొట్లోనో పెద్ద ఫాయిలో అనుకోండి, ఓ అరగంట లెక్కలు చూడ్డం తప్పదు, ఈ అప్పు తీరకనూపోదు. ఇది దైనందిన కార్యక్రమమేగా, అనే ధైర్యంతో ఇంటికి చేరాడు వెంకట్రాయుడు. తనభార్యతో మాట్లాడుతూన్న అకౌంటెంటు జోషీ భార్య చెప్పుతూంది, రెండు నెలల జీతం బోనసు వస్తుందని, తన భర్తకు మటుకే ఆ సంగతి తెలుసనీ. జోషీ భార్య వెళ్ళగానే లక్ష్మిని గుచ్చి కౌగిలించుకున్నాడు వెంకట్రాయుడు "దీంతో అప్పులు తీరిపోయే" అనీ, అప్పు ఇక చెయ్యనక్కరలేదనీ.

వాకిట్లో తలుపుకొట్టిన చప్పుడు. పోస్టుమేను ఉత్తరం ఇచ్చాడు. "నాసికా పండరిపురం చూడ్డానికి అమ్మ బొంబాయి వస్తూంది. ఎల్లుండి దశమీ మంగళవారం బయలుదేరుతూంది" అని సరస్వతక్క దగ్గర్నుంచి.

"అత్తగారొస్తుందా? అది మనమడి అదృష్టమండీ" అంది లక్ష్మి. "ఔను. నేను ఈ నాలుగేళ్ళు కుస్తీ పడుతున్నది నా అదృష్టంతోనే. మేం ఇద్దరం సమ ఉజ్జీలం" అన్నాడు వెంకట్రాయుడు రాబోయే అమ్మకోసం సంతోషం, దాంతో రాబోయే అప్పుకోసం గాభరా మిళితం కాగా, ఒణుకుతూన్న కంఠంతో.

నిజమైన స్నేహం మంచి ఆరోగ్యంవంటిది. అది పోగొట్టుకున్నప్పుడు కాని దాని విలువ మనకు తెలీదు.—కోల్టన్